క్లుప్తంగా

అరటి గెలల నివేదన



రామయ్యకు అరటి గెలలు నివేదించిన భక్తులు

ఎల్.ఎన్.పేట: మండలంలోని శ్యామలాపురం, కృష్ణాపురం, తురకపేట సెంటర్ తదితర గ్రామాల్లో రామయ్య తండ్రి సంబరాలు శనివారం భక్తిశ్రద్ధలతో నిర్వహించారు. సంబరాలు జరిగే ప్రాంతంలో కొబ్బరి కమ్మలతో పందిర్లు వేశారు. ఆయా పందిర్లకు భక్తులు అరటి గెలలను కట్టి మొక్కులు తీర్చుకున్నారు. ఏడాది, రెండేళ్లు, మూడేళ్లకు ఒకసారి రామయ్య సంబరాలు నిర్వహిస్తామని ఆయా గ్రామస్తులు తెలిపారు.

కేజీబీవీకి నీటి సదుపాయం



పైప్‌లైన్‌ను పరిశీలిస్తున్న కార్యదర్శి అప్పారావు

మెళియాపుట్టి: మండల కేంద్రంలోని కేజీబీవీ పాఠశాలలో కొన్ని రోజులుగా నీటి సదుపాయంలేక విద్యార్థినులు దుస్తులు ఉతకడానికి, ఇతరత్రా అవసరాలకు అనేక ఇబ్బందులు పడేవారు. దీనిపై పంచాయతీ సిబ్బంది స్పందించారు. కుళాయిలు, పైప్‌లైన్లు ఏర్పాటు చేశారు. కార్యదర్శి అప్పారావు శనివారం పైప్‌లైన్‌ను పరిశీలించారు. నీటి సమస్య లేకుండా చేశామని, విద్యార్థులు అవసరం మేరకు నీటిని వాడుకోవాలన్నారు.

ఆక్రమణపై చర్యలు తీసుకోవాలి



మాట్లాడుతున్న ఎమ్మెల్యే రమణమూర్తి

నరసన్నపేట: స్థానిక పంచాయతీ కార్యాలయం ఎదురుగా ఉన్న బోర్డు బంగ్లా స్థలం.. మండల పరిషత్‌కు చెందినదని, కొందరు తప్పుడు సర్వే నంబర్లు సృష్టించి ఆక్రమణలకు పాల్పడం సరైంది కాదని నరసన్నపేట ఎమ్మెల్యే బగ్గు రమణమూర్తి అన్నారు. శనివారం నరసన్నపేటలో విలేకర్లతో మాట్లాడారు. గంజాం జిల్లాలో ఉన్న సమయంలోనే బోర్డు బంగ్లా నిర్మాణం జరిగిందన్నారు. రాష్ట్రం ఏర్పడిన తరువాత ఈ స్థలాన్ని సమితులకు అప్పగించారన్నారు. కొందరు వ్యక్తులు కరోనా సమయంలో తప్పుడు డాక్యుమెంట్లు సృష్టించి విలువైన స్థలాన్ని కాజేయాలని చూస్తున్నారన్నారు. దీనిపై కలెక్టర్, ఆర్డీఓ, స్థానిక రెవెన్యూ అధికారులకు లిఖితపూర్వకంగా ఫిర్యాదు చేశారన్నారు. దీనిపై అధికారులు తగిన చర్యలు తీసుకోవాలన్నారు.

బసివలస రోడ్డు బంద్



ఫ్లెక్సీని ఏర్పాటు చేసిన బసివలస గ్రామస్తులు

నరసన్నపేట: మండలంలోని నరసన్నపేట నుంచి బసివలస మీదుగా బాలసీమ రోడ్డులో వారం రోజులు రాకపోకలను నిలిపివేస్తున్నట్లు గ్రామస్తులు శనివారం తెలిపారు. బాలసీమ–బసివలసల మధ్య సీసీ రోడ్డు పనులు సోమవారం నుంచి ప్రారంభిస్తున్నందును ఆరోజు నుంచి వారం వరకు రాకపోకలు నిలుపుదల చేస్తున్నామని, వాహనదారులు సహకరించాలని కోరారు. ఈ మేరకు ఫ్లెక్సీని ఏర్పాటు చేశారు.

క్రీడా పోటీల్లో ప్రతిభ



షీల్డ్ అందుకుంటున్న హారిక

నరసన్నపేట: జిల్లా స్థాయిలో నెహ్రూ యువ కేంద్రం నిర్వహించిన ఆటల పోటీల్లో నరసన్నపేటకు చెందిన బెవర హారిక వంద మీటర్లు పరుగు పందెంలో ద్వితీయ స్థానం సాధించింది. హారిక స్థానిక పద్మావతి జూనియర్ కళాశాలలో ఇంటర్ చదువుతోంది. శనివారం శ్రీకాకుళంలో ఈ పోటీలు నిర్వహించారు. ప్రతిభ చూపిన విద్యార్థులకు నెహ్రూ యువ కేంద్రం డిప్యూటీ డైరెక్టర్ కె.వెంకట్ ఉజ్వల్ సర్టిఫికెట్లు, షీల్డ్‌లను అందజేశారు. సెట్‌శ్రీ సీఈఓ బి.ప్రసాదరావు, ఎన్‌వైకే ప్రతినిధి ఉమామహేశ్వరరావు తదితరులు పాల్గొన్నారు. హారికకు పద్మావతి విద్యా సంస్థల డైరెక్టర్ దుర్గాప్రసాద్ అభినందించారు.

3న ఆలయ భూముల వేలం

పాతపట్నం: మండల కేంద్రంలోని నీలకంఠేశ్వర స్వామి దేవస్థానం భూములు (21 ఎకరాలు) మూడేళ్లకు(2025–2028) మార్చి 3వ తేదీ బహిరంగ వేలం వేయనున్నారు. ఈ మేరకు ఆలయ ఈఓ టి.వాసుదేవరావు శనివారం ఒక ప్రకటనలో తెలిపారు. ఉదయం 11 గంటలకు ఆలయం వద్ద వేలం ఉంటుందన్నారు. వేలంలో పాల్గొనేవారు రూ.వెయ్యి ప్రధమ ధరావత్తు చెల్లించాలన్నారు. బకాయి ఉన్నవారు వేలం పాటలో పాల్గొనేందుకు అనర్హులన్నారు. పాట పాడుకున్నవారు ఒక సంవత్సరం మొత్తాన్ని అడ్వాన్స్‌గా చెల్లించాలన్నారు.

ప్లాస్టిక్ భూతం





ఆమదాలవలస మార్కెట్‌లో పాలథిన్ కవర్లతో సరుకులు తీసుకువెళ్తున్న వినియోగదారులు

- యథేచ్ఛగా పాలిథిన్, ప్లాస్టిక్ వస్తువుల వినియోగం
- పట్టించుకోని అధికారులు
- తూతూ మంత్రంగా అవగాహన కార్యక్రమాలు

ఆమదాలవలస: ప్లాస్టిక్ భూతం పర్యావరణాన్ని విచ్ఛిన్నం చేస్తోంది. ప్రజల ఆరోగ్యానికి హాని కలిగిస్తోంది. 120 మైక్రాన్‌ల కన్నా తక్కువ పరిమాణం ఉన్న కవర్లు వినియోగిస్తే అనర్థం కలుగుతుందని అవగాహన కల్పిస్తున్నా ఉత్పత్తిదారులు, వినియోగదారుల్లో మార్పు రావడంలేదు. వీటిని నియంత్రించాల్సిన అధికారులు సైతం సరుకు మూలం ఎక్కడో, ఎక్కడ ఉత్పత్తి అవుతుందో తెలిసినా అచేతనంగా చూస్తున్నారు తప్ప కనీస చర్యలు లేవు. ఆమదాలవలస మున్సిపాలిటీ, మండలం, సరుబుజ్జిలి, పొందూరు, బూర్జ పట్టణాల్లో గల దుకాణాల్లో ప్లాస్టిక్ కవర్ల వినియోగం ఎక్కువగా ఉంది.

నిబంధనలకు పాతర..

75 మైక్రాన్ల లోపు మందం గల ప్లాస్టిక్‌ను వినియోగించకూడదనే నిబంధనలు ఉన్నప్పటికీ ఎవరూ పాటించడంలేదు. 75 నుంచి 120 మైక్రాన్ల కంటే తక్కువ పరిమాణం ఉన్న ప్లాస్టిక్ కవర్లు ఎక్కడపడితే అక్కడే విక్రయిస్తున్నారు. వ్యాపారులు సైతం అటువంటి సంచుల్లోనే సరకులు ఇచ్చి పంపుతున్నారు. దీనిని నియంత్రించాల్సిన అధికారులు చోద్యం చూస్తున్నారు.

ప్రత్యామ్నాయ చర్యలు శూన్యం

సింగిల్ యూజ్ ప్లాస్టిక్‌ను నిషేధించి వాటి స్థానంలో జూట్ బ్యాగ్‌లు, క్లాత్ బ్యాగ్‌లు, కాగితం కవర్లను అందుబాటులో ఉంచాలి. అటువంటి ప్రత్యామ్నాయ మార్గాలను ఎవరూ చూపటంలేదు. పత్తి, వెదురు, చెక్క, మట్టి, పింగాణీ, ప్రకృతిలో త్వరగా కలిసిపోయే ప్లాస్టిక్‌తో చేసిన వస్తువులను వాడాలి. మట్టి, పింగాణీ పాత్రలను ఆహారం నిల్వ చేయటానికి వినియోగించుకోవచ్చు. ప్రజలు వినియోగించిన ప్లాస్టిక్ కవర్లు రోడ్లపై వేయడంతో అవి తిన్న మూగజీవులు సైతం మృత్యువాత పడుతున్నాయని జంతు ప్రేమికులు ఆందోళన చెందుతున్నారు.

కానరాని అవగాహన కార్యక్రమాలు..

ఆమదాలవలస పట్టణం, బూర్జ, పొందూరు, సరుబుజ్జిలి మండల కేంద్రాల్లో ఎక్కడ చూసినా ప్లాస్టిక్ కవర్లు దర్శనమిస్తున్నాయి. టీ దుకాణాల వద్ద వేడి టీని ప్లాస్టిక్ కవర్లలోనే వేస్తున్నారు. అలా చేయడం వల్ల ప్లాస్టిక్ కరుగుతుంది. ఆ టీ తాగడంతో కొద్దిరోజులకే క్యాన్సర్ బారిన పడుతున్నారు. పట్టణ పరిధిలో ఎక్కడా ప్లాస్టిక్ నిషేధంపై అవగాహన కార్యక్రమాలు నిర్వహించడంలేదు. అప్పుడప్పుడు అధికారులు వచ్చి తూతూ మంత్రంగా చెప్పి వెళ్తున్నారు. దీనిపై పూర్తి స్థాయిలో అధికారులు చర్యలు తీసుకోవాలి.

చర్యలు తీసుకుంటాం



గతంలో ప్లాస్టిక్ నివారించేందుకు కట్టుదిట్టమైన చర్యలు చేపట్టాం. ప్రస్తుతం మళ్లీ పాలథిన్ కవర్లు వినియోగిస్తున్నట్లు తమ దృష్టికి వచ్చింది. త్వరలోనే స్పెషల్ డ్రైవ్ ఏర్పాటు చేసి దుకాణదారులు, ప్రజలకు అవగాహన కల్పిస్తాం. దుకాణాల్లో ప్లాస్టిక్ కవర్లు విక్రయిస్తే భారీగా అపరాధ రుసుం విధించేలా చర్యలు చేపడతాం.

– పి.బాలాజీప్రసాద్, మున్సిపల్ కమిషనర్, ఆమదాలవలస

సూపర్ సిక్స్ అమలు ఎప్పుడు?



- పేదలను మోసం చేసిన కూటమి ప్రభుత్వం
- పాతపట్నం మాజీ ఎమ్మెల్యే రెడ్డి శాంతి

ఎల్.ఎన్.పేట: సూపర్ సిక్స్ హామీలు అమలు చేయకుండా సీఎం చంద్రబాబు పేదలను మోసం చేస్తున్నారని పాతపట్నం మాజీ ఎమ్మెల్యే రెడ్డి శాంతి శనివారం ఒక ప్రకటనలో ఆరోపించారు. కూటమి ప్రభుత్వం అధికారం చేపట్టి 9 నెలలు అవుతున్నా సూపర్ సిక్స్ పథకాలు అమల్లో నిర్లక్ష్యంగా ఉందన్నారు. ఎన్నికల ముందు సూపర్ సిక్స్ పథకాలు పక్కాగా అమలు చేస్తామని కూటమి నాయకులు ఇంటింటికీ వెళ్లి కరపత్రాలు పంపిణీ చేశారన్నారు. సామాజిక భద్రత పింఛన్ల పంపిణీలోనూ ప్రతీ నెల కొంత మంది లబ్ధిదారులకు కోత విధిస్తున్నారని ఆందోళన వ్యక్తం చేశారు. సంపద సృష్టిస్తానని అనేక బహిరంగ సభల్లో చెప్పిన చంద్రబాబు.. ఈ తొమ్మిది నెలల పాలనలో ఎంత సంపద సృష్టించారో ప్రజలకు అర్థమయ్యేలా చెప్పాలని డిమాండ్ చేశారు. సామాజిక భద్రత పింఛన్లు, ప్రభుత్వ ఉద్యోగుల జీతాల కోసం ఇప్పటివరకు రూ.1.50 లక్షల కోట్లు అప్పుచేశారన్నారు. మాజీ సీఎం వైఎస్ జగన్‌మోహన్ రెడ్డి అప్పులు చేసి రాష్ట్రాన్ని శ్రీలంక చేస్తున్నారని ప్రచారం చేసిన చంద్రబాబు.. తక్కువ రోజుల పాలనలో అంత మొత్తంలో అప్పులు ఎలా చేశారని ప్రశ్నించారు. కరోనా వంటి కష్టకాలంలో రాష్ట్ర ఆర్థిక పరిస్థితి దిగజారిపోయినప్పటికీ గత వైఎస్సార్‌సీపీ ప్రభుత్వం పేదలకు సంక్షేమ పథకాల అమలు చేసిందని గుర్తుచేశారు. తల్లికి వందనం, ఆర్టీసీ బస్సుల్లో ఉచిత ప్రయాణం, మహిళలకు నెలకు రూ.1500 ఆర్థిక సహాయం, రైతులకు పెట్టుబడి సాయం ఎప్పుడు ఇస్తారో చెప్పాలన్నారు.

ఉపాధ్యాయుడిపై ఫిర్యాదు



ఫిర్యాదుపత్రాన్ని చూపుతున్న కార్మికులు

సరుబుజ్జిలి: మండలానికి చెందిన ప్రభుత్వ ఉపాధ్యాయుడిపై క్వారీ కార్మికులు శనివారం స్థానిక పోలీసులకు ఫిర్యాదు చేశారు. బూర్జ మండలం కొరగాం రెవెన్యూ పరిధిలోని ముంగెన్న కొండపై 20 ఏళ్లుగా పలు గ్రామాలకు చెందిన 150 కుటుంబాలు రాళ్ల తవ్వకాలతో జీవనోపాధి పొందుతున్నాయని కార్మికులు తెలిపారు. కొండ పరీవాహక ప్రాంతంలో ఉన్న 5 ఎకరాల డీ–పట్టాను సరుబుజ్జిలి మండలంలోని రొట్టవలస గ్రామానికి చెందిన ప్రభుత్వ ఉపాధ్యాయుడు కొనుగోలు చేశారన్నారు. క్వారీ ప్రాంతానికి చేరుకోవాలంటే కార్మికులంతా కలిసి నెలవారీ సుంకం చెల్లించాలని, లేదంటే తన భూమిలో నడిచేందుకు అంగీకరించేదిలేదని ఉపాధ్యాయుడు ఇబ్బంది పెడుతున్నారన్నారు. తమకు ఉపాధిలేక కుటుంబాలతో పస్తులు ఉంటున్నామని, వెంటనే పోలీసులు కలుగజేసుకుని చర్యలు తీసుకోవాలని కోరారు. ఫిర్యాదు విషయమై ఎస్‌ఐ బి.హైమావతి వద్ద ప్రస్తావించగా.. కార్మికులు ఫిర్యాదు చేసిన మాట వాస్తవమేనన్నారు. ఫిర్యాదుపై పూర్తిస్థాయిలో విచారణ చేపడతామన్నారు.

భూమికి పచ్చాని రంగేసినట్టు..




సారవకోట మండలంలో రబీ సీజన్లో వేసిన వరి పంట ఆశాజనకంగా ఉంది. మండలంలో అతిపెద్ద విస్తీర్ణంలో ఉన్న రంగసాగరం ఆయకట్టు గ్రామమైన కొత్తూరులో గత ఏడాది చివర్లో, ఈ ఏడాది ప్రారంభంలో రబీ వరినాట్లు వేశారు. ప్రస్తుతం కొన్ని పంట పొలాలు వరి ఎన్నులు కన్పిస్తున్నాయి. మార్చి రెండు, మూడో వారం నాటికి పంట కోత దశకు వచ్చే అవకాశం ఉంది. ప్రతి ఏటా ఈ గ్రామాల్లో ఎకరాకు 38 నుంచి 40 బస్తాల వరకు దిగుబడి వస్తున్నట్లు రైతులు తెలిపారు. – సారవకోట

అవగాహన



చెత్తను బుట్టల్లో వేసి గ్రీన్ అంబాసిడర్లకు అందజేయాలని మెళియాపుట్టి పంచాయతీ కార్యదర్శి అప్పారావు అన్నారు. శనివారం మెళియాపుట్టి మండల కేంద్రంలో చేపడుతున్న ఉపాధి హామీ పనుల వద్దకు వెళ్లి పారిశుద్ధ్యంపై అవగహన కల్పించారు. మురుగు కాలవల్లో చెత్త చెదారం వేయరాదని, నివాస ప్రాంతాలు పరిశుభ్రంగా ఉంచుకోవాలన్నారు. ట్రాక్టర్‌ను వీధుల్లోకి పంపిస్తామని అందులోనే చెత్త వేయాలన్నారు. వీధి దీపాలు వెలగక పోయినా, సమయానికి తాగునీరు అందకపోయినా, వీధుల్లో ఎక్కడైనా మురుగు నిల్వలు ఉన్నా, ఇతర సమస్యలు ఏవైనా ఉంటే రాతపూర్వకంగా సమస్యను రాసి సచివాలయంలో ఫిర్యాదు చేయాలన్నారు. – మెళియాపుట్టి

ప్రమాదకర మలుపు



ఆమదాలవలస నుంచి బూర్జ, పాలకొండ వైపు వెళ్లే సీఎస్పీ రహదారిలో లక్ష్మిడిపేట–తిమ్మాపురం జంక్షన్‌కు మధ్యలో పెద్ద మలుపు ఉంది. రహదారికి ఇరువైపులా పిచ్చిమొక్కలు ఏపుగా పెరిగిపోవడంతో ఎదురుగా వచ్చే వాహనాలు కనిపించడం లేదు. ఈ మలుపు వద్ద ఇటీవల జరిగిన ప్రమాదంలో కొత్తూరుకు చెందిన ఇద్దరు యువకులు మృతిచెందారు. పలువురు గాయాలు పాలవుతున్నారు. మలుపు వద్ద స్పీడ్ బ్రేకర్లు, హెచ్చరిక బోర్డులు ఏర్పాటు చేయాలని, పిచ్చిమొక్కలు తొలగించాలని ప్రయాణికులు కోరుతున్నారు. – ఆమదాలవలస

నిర్మాణం పూర్తయ్యేనా?



ఎల్.ఎన్.పేట మండల కేంద్రంలో 2011లో రూ.25లక్షల నిధులతో ప్రారంభించిన స్త్రీశక్తి భవన నిర్మాణ పనులు మధ్యలోనే నిలిచిపోయాయి. మండల పరిషత్ కార్యాలయం వెనుక స్త్రీశక్తి భవన నిర్మాణం పనులు చేపట్టారు. రెండు అంతస్థుల్లో భవన నిర్మాణం కోసం చేపట్టిన పనులు సుమారు 15 ఏళ్ల నుంచి అసంపూర్తిగానే వదిలేశారు. మండల కేంద్రంలో భవనాల కొరత ఉన్నప్పటికీ.. స్త్రీశక్తి భవన నిర్మాణం పనులు ఎందుకు పూర్తి చేయటంలేదని పలువురు ప్రశ్నిస్తున్నారు. అధికారులు, పాలకులు స్పందించి భవన నిర్మాణ పనులు పూర్తిచేయాలని కోరుతున్నారు. – ఎల్.ఎన్.పేట

దౌర్జన్యంగా ప్రహరీ నిర్మాణం

- తహసీల్దార్‌కు ఫిర్యాదు చేసిన ఉపాధ్యాయిని



నిర్మాణ పనులు చేపడుతున్న దృశ్యం

నరసన్నపేట: మండలంలోని కానుకుర్తువానిపేట ప్రాథమిక పాఠశాలకు చెందిన స్థలంలో గ్రామానికి చెందిన వ్యక్తి దౌర్జన్యంగా ప్రహరీ నిర్మాణం చేపట్టడం పట్ల సర్వత్రా నిరసన వ్యక్తం అవుతోంది. టీడీపీ తాలూకా అని చెప్పి పాఠశాలకు చెందిన స్థలంలో ప్రహరీ నిర్మాణం చేపడుతున్నారు. ఇటీవల పునాదులు తవ్వినప్పుడు ఎంఈఓలు శాంతారావు, దాలినాయుడు వెళ్లి పరిశీలించారు. సచివాలయ సిబ్బందితో రికార్డులు పరిశీలించి అది ప్రభుత్వ స్థలంగా నిర్ధారించి, ఎటువంటి పనులు చేపట్టవద్దని సూచించారు. సదరు వ్యక్తి కొద్ది రోజులు పనులు నిలిపివేశారు. స్థానిక టీడీపీ నాయకులను కలిసిన తరువాత శనివారం మళ్లీ నిర్మాణ పనులు చేపట్టారు. దీనిపై తహసీల్దార్ సత్యనారాయణకు స్కూల్ ఉపాధ్యాయిని ఉమాలక్ష్మి ఫిర్యాదు చేశారు. పనులను అడ్డుకోవాలని కోరారు. నిర్మాణ పనులు ఏమాత్రం ఆగలేదు. దౌర్జన్యంగా పాఠశాల స్థలాన్ని ఆక్రమించుకోవడం పట్ల గ్రామస్తులు ఆందోళన చెందుతున్నారు. అధికార పార్టీ అండతో పాఠశాల స్థలాన్ని ఆక్రమించుకోవడం శోచనీయమని అంటున్నారు. దీనిపై తహసీల్దార్ వద్ద ప్రస్తావించగా.. ఈ స్థలానికి సంబంధించిన రికార్డులు లేవని, ఈ స్థలం స్కూల్‌కు చెందింది అనే ఆధారాలు కూడా లేవన్నారు. నిర్మాణ పనులు చేస్తున్న వారి వద్ద రిజిస్టర్డ్ డాక్యుమెంట్ ఉందన్నారు.

పార్టీ కోసం కష్టపడిన వారికి గుర్తింపు



సింహాద్రి, నాగేశ్వరరావును సత్కరిస్తున్న రెడ్డి శాంతి

కొత్తూరు: వైఎస్సార్‌సీపీ బలోపేతానికి కష్టపడిన ప్రతి కార్యకర్తకూ గుర్తింపు ఉంటుందని పాతపట్నం మాజీ ఎమ్మెల్యే రెడ్డి శాంతి అన్నారు. నియోజకవర్గ ఎస్టీ సెల్ అధ్యక్షుడిగా సవర సింహాద్రి, బీసీ సెల్ అధ్యక్షుడిగా అగతముడి నాగేశ్వరరావు ఇటీవల నియమితులయ్యారు.

వీరిని పాతపట్నంలోని తన స్వగృహం వద్ద రెడ్డి శాంతి శనివారం సత్కరించారు. పీఏసీఎస్ మాజీ అధ్యక్షుడు చింతాడ సూర్యనారాయణ, పార్టీ మండల కన్వీనర్ గండివలస ఆనందరావు, సర్పంచ్ ధర్మారావు, అగతముడి రంజిత్, వి.లక్ష్మీనారాయణ, తదితరులు పాల్గొన్నారు.

సంక్షిప్తంగా..

ఆశ్రమ పాఠశాల తనిఖీ



విద్యార్థులతో మాట్లాడుతున్న ఐటీడీఏ డీడీ అన్నదొర

మెళియాపుట్టి: ఆశ్రమ పాఠశాలల్లో విద్యార్థులకు నాణ్యమైన విద్యతోపాటు, పరిశుభ్రమైన వాతావరణం, మెనూ ప్రకారం భోజనం అందించాలని సీతంపేట ఐటీడీఏ డీడీ అన్నదొర అన్నారు. నేలబొంతు గిరిజన సంక్షేమ ఆశ్రమ పాఠశాలను శనివారం తనిఖీ చేశారు. మరుగుదొడ్లు, తాగునీరు, వంటగది, తరగతి గదులు, బెడ్లు పరిశీలించారు. పదో తరగతి విద్యార్థులతో మాట్లాడారు. ఏవైనా సమస్యలుంటే తన దృష్టికి తీసుకురావాలన్నారు. హెచ్‌ఎం బి.విజయభారతి, పలువురు ఉపాధ్యాయులు ఉన్నారు.

దరఖాస్తుల ఆహ్వానం

బూర్జ: మండలంలోని ఓ.వి.పేట ఏపీ మోడల్ స్కూల్‌లో 2025–26 విద్యా సంవత్సరంలో ఆరో తరగతిలో ప్రవేశాలకు దరఖాస్తులను ఆహ్వానిస్తున్నట్లు ప్రిన్సిపాల్ బొడ్డేపల్లి శ్రీనివాసరావు శనివారం తెలియజేశారు. ఆన్‌లైన్‌లో దరఖాస్తు చేసుకోవాలన్నారు. ప్రభుత్వం గుర్తింపు పొందిన పాఠశాలలో 5వ తరగతి చదివి ఉండాలన్నారు. 5వ తరగతి స్థాయిలో తెలుగు, ఇంగ్లిష్ మీడియంలో ప్రవేశ పరీక్ష సిలబస్ ఉంటుందన్నారు. ఎస్సీ, ఎస్టీ విద్యార్థులు రూ.75, బీసీ, ఓసీ విద్యార్థులు రూ.150 ఫీజు చెల్లించాలన్నారు. దరఖాస్తులను ఫిబ్రవరి 25 నుంచి మార్చి 31వ తేదీ వరకు చేసుకోవాలన్నారు. ఏప్రిల్ 20వ తేదీన ప్రవేశ పరీక్ష ఉంటుందన్నారు.

కృతజ్ఞతలు

పాతపట్నం: వైఎస్సార్‌సీపీ బలోపేతానికి తనవంతు కృషి చేస్తానని పాతపట్నం నియోజకవర్గ ఆర్టీఐ వింగ్ విభాగం అధ్యక్షుడుగా ఏనుగుతల సూర్యనారాయణ (సూర్యం) శనివారం అన్నారు. పార్టీ పదవి దక్కడంతో మాజీ ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డికి, పాతపట్నం మాజీ ఎమ్మెల్యే రెడ్డి శాంతికి కృతజ్ఞతలు తెలిపారు.

పశు బీమా సద్వినియోగం చేసుకోవాలి

పాతపట్నం: పశు బీమా పథకాన్ని పాడి రైతులు సద్వినియోగం చేసుకోవాలని పాతపట్నం పశుసంవర్ధకశాఖ ఏడీ మంచు కరుణాకరరావు అన్నారు. మండలంలోని సీడి పశువైద్యశాలలో పశు బీమాను శనివారం పరిశీలించారు. రూ.15 వేలు విలువ చేసే పశువులకు ప్రీమియం రూ.960, ప్రభుత్వం వాటా రూ.786, రైతు వాటా రూ.199 ఉంటుందన్నారు. రూ.30 వేల విలువ చేసే పశువులకు ప్రీమియం రూ.1,920, ప్రభుత్వం వాటా రూ.1,536, రైతు వాటా రూ.398 చెల్లించాలన్నారు. ఈ బీమా మూడేళ్లు వర్తిస్తుందన్నారు. రూ.30 వేల కంటే ఎక్కువ మొత్తానికి బీమా చేయించుకుంటే సబ్సిడీ రూ.1,536 మాత్రమే వర్తిస్తుందన్నారు. జిల్లాలో సబ్సిడీ నగదు ప్రస్తుతానికి రూ.10 లక్షలు ఉందని, టెక్కలి డివిజన్‌లో ఒక్కొక్క ప్రాంతీయ పశువుల ఆస్పత్రి పరిధిలో ఉన్న పశువులకు రూ.62,500 సబ్సిడీ మొత్తాన్ని టార్గెట్‌గా నిర్ణయించామన్నారు. పాతపట్నం ప్రాంతీయ పశువైద్యశాల పరిధిలో రెండు రోజుల్లో 33 పాడి పశువులకు బీమా చేయించామన్నారు.

ఎన్నికల కోడ్ ఉల్లంఘన



పాతపాడులో దర్శనమిస్తున్న టీడీపీ బ్యానర్

కొత్తూరు: మండలంలోని మదనాపురం పంచాయతీ పరిధి పాతపాడు గ్రామంలో శనివారం నాటికి కూడా టీడీపీ నాయకుల బ్యానర్ తొలగించకపోవడం అధికారుల నిర్లక్ష్యానికి నిదర్శనమని పలువురు ఆరోపిస్తున్నారు. ఉత్తరాంధ్ర ఉపాధ్యాయ ఎమ్మెల్సీ ఎన్నికల నేపథ్యంలో ప్రస్తుతం కోడ్ అమలులో ఉంది. ఎన్నికలకు మరో ఐదు రోజులే సమయం ఉన్నప్పటికీ పలు గ్రామాల్లో అధికార పార్టీకి చెందిన నేతల బ్యానర్లు దర్శనమిస్తున్నాయి.

రెండు నెలలుగా అందని రేషన్

సారవకోట: మండలంలోని బుడితి గ్రామంలో సుమారు 120 మంది రేషన్ కార్డుదారులకు సరుకులు అందడం లేదు. ఒకటో రేషన్ డిపో పరిధిలో జనవరి, ఫిబ్రవరిలో రేషన్ అందలేదని కార్డుదారులు ఆరోపిస్తున్నారు. దీనిపై సీఎస్ డీటీ షరీఫ్‌కు వివరణ కోరగా.. ఫిబ్రవరిలో అలాంట్‌మెంట్ తక్కువగా వచ్చాయని, అందువల్లే సరుకులు అందలేదన్నారు. ఎండీఎం ఆపరేటర్ నిర్లక్ష్యంగా వ్యవహరిస్తున్నారని, అలాంట్‌మెంట్ తక్కువగా ఇస్తున్నారనే విషయం తన దృష్టికి తీసుకురావడం లేదన్నారు. దీనివల్ల రేషన్ కార్డుదారులు ఇబ్బంది పడుతున్నారన్నారు. మార్చి నుంచి ఈ సమస్య తలెత్తకుండా తగిన చర్యలు తీసుకుంటామన్నారు.

ఎమ్మెల్సీ ఓటర్లు 54 మంది..

బూర్జ: మండలంలో ఉత్తరాంధ్ర ఉపాధ్యాయ ఎమ్మెల్సీ ఓటర్లు 54 మంది ఉన్నట్లు తహసీల్దార్ వై.వి.పద్మావతి శనివారం తెలిపారు. ఈ నెల 27న ఎమ్మెల్సీ ఎన్నికలు జరుగుతాయన్నారు. బూర్జ జెడ్పీ హైస్కూల్‌లో పోలింగ్ కేంద్రం (26) ఏర్పాటు చేశామన్నారు. పురుషులు 41 మంది, స్త్రీలు 13 మంది ఓటు హక్కును వినియోగించనున్నట్లు తెలిపారు.

పరీక్ష సామగ్రి వితరణ



విద్యార్థులకు పరీక్ష సామగ్రిని వితరణ చేస్తున్న రాజశేఖర్, ఉపాధ్యాయులు

పొందూరు: మండలంలోని తాడివలస జెడ్పీ హైస్కూల్‌లో 10వ తరగతి చదువుతున్న 56 మంది విద్యార్థులకు శనివారం స్థానిక ఏపీజీవీబీలో క్యాషియర్‌గా పని చేస్తున్న వైదా రాజశేఖర్ వివిధ రకాల పరీక్ష సామగ్రిని అందించారు. ఈ పాఠశాలలో చదువుతున్న విద్యార్థులు జిల్లా స్థాయిలోని ప్రథమ స్థానం కైవాసం చేసుకోవాలన్నారు. పరీక్షలు అంటే భయం వీడి ఆత్మవిశ్వాసంతో సిద్ధం కావాలన్నారు. హెచ్‌ఎం మెట్ట అనంతభట్లు, గోపాలశెట్టి సాయికుమార్, బ్యాంకు మిత్ర తమ్మినేని ఊర్మిళ పలువురు పాల్గొన్నారు.

క్రమశిక్షణతోనే ఉజ్వల భవిష్యత్



సరుబుజ్జిలి: మాట్లాడుతున్న ఎంఈఓ శ్రీనివాసరావు

సరుబుజ్జిలి: క్రమశిక్షణతో కూడిన విద్యనభ్యసించడం వలన విద్యార్థులకు ఉజ్వల భవిష్యత్ సాధ్యపడుతుందని ఎంఈఓ కె.శ్రీనివాసరావు తెలిపారు. మండల కేంద్రంలో గల వెంకటసాయి జూనియర్ కళాశాల వార్షికోత్సవాన్ని శనివారం నిర్వహించారు. విద్యార్థులు మంచి మార్గంలో పయనించాలన్నారు. ఈ సందర్భంగా విద్యార్థులు డాన్స్‌లు, సాంస్కృతిక ప్రదర్శనలతో సందడి చేశారు. విద్యా సంస్థల కరస్పాండెంట్ కూన జగన్నాథం, ప్రిన్సిపాల్ బెండి పురుషోత్తమరావు, పలువురు అధ్యాపకులు పాల్గొన్నారు.

నైతిక విలువతో కూడిన విద్య అవసరం

కొత్తూరు: నైతిక విలువతో కూడిన విద్య అవసరమని ఎద్దు సుందరనారాయణ వరహాలమ్మ చారిటబుల్ ట్రస్టు చైర్మన్ ఎద్దు గోపాలదాసునాయుడు అన్నారు. స్థానిక ప్రభుత్వ జూనియర్ కాలేజీలో శనివారం ఫేర్‌వెల్ డేను ప్రిన్సిపాల్ బండారి రవికుమార్ ఆధ్వర్యంలో నిర్వహించారు. విద్యతోపాటు నైతిక విలువలు ఎంతో అవసరమన్నారు. జానపద, సినీ గీతాలతో విద్యార్థులు సందడి చేశారు. నాటక ప్రదర్శనలు ఆకట్టుకున్నాయి. అధ్యాపకులు గోవిందరావు, రామరాజు, లక్ష్మీనారాయణ, తదితరులు పాల్గొన్నారు.

మానసిక ఒత్తిడికి గురికావద్దు



హాల్ టికెట్లు పంపిణీ చేస్తున్న ప్రిన్సిపాల్, అధ్యాపకులు

నరసన్నపేట: పరీక్షలు రాసేటప్పుడు విద్యార్థులు మానసిక ఒత్తిడికి గురి కావద్దని, మనస్సును ప్రశాంతంగా ఉంచుకోవాలని, ఆహారపు అలవాట్లు మార్చుకోవాలని ప్రభుత్వ జూనియర్ కళాశాల ప్రిన్సిపాల్ మరపట్ల పవన్ అన్నారు. ఆన్‌లైన్‌లో విడుదల చేసిన హాల్ టికెట్లను శనివారం విద్యార్థులకు అందజేశారు. ఈ సందర్భంగా ప్రిన్సిపాల్ మాట్లాడుతూ పరీక్షలు జరిగే పది రోజులు నిద్ర, ప్రయాణాలు, అలవాట్లు విషయాల్లో జాగ్రత్తగా ఉండాలన్నారు. సీసీ కెమెరాల పర్యవేక్షణలో పరీక్షలు జరుగుతాయన్నారు. ఎకనామిక్స్ అధ్యాపకుడు ఎస్.సత్యనారాయణ, లైబ్రేరియన్ వదన గిరి, పలువురు అధ్యాపకులు పాల్గొన్నారు.

అక్రమార్కులపై చర్యలు తీసుకోవాలి



తహసీల్దార్‌కు వినతిపత్రం అందజేస్తున్న శ్రీనివాసరావు

హిరమండలం: వంశధార నిర్వాసితులకు ఇచ్చే ఇళ్ల స్థలాల్లో అక్రమాలు జరిగాయని, అక్రమార్కులపై చట్టపరమైన చర్యలు తీసుకోవాలని తహసీల్దార్ హనుమంతురావును నిర్వాసితుడు బూర్లె శ్రీనివాసరావు కోరారు. స్థానిక తహసీల్దార్ కార్యాలయంలో తహసీల్దార్‌కు శనివారం వినతిపత్రం అందించారు. ఈ సందర్భంగా శ్రీనివాసరావు మాట్లాడుతూ.. ప్రభుత్వం అప్పట్లో ఒక్కో నిర్వాసిత కుటుంబానికి ఇంటి స్థలం ఇచ్చిందన్నారు. ఇంటి స్థలం వద్దనుకుంటే రూ.5 లక్షల పరిహారం అందించిందన్నారు. అడపాక ఫల్గుణరావు, బోర ఢిల్లేశ్వరరావు కుటుంబాలవారు ఇళ్ల స్థలాలతోపాటు పరిహారం కూడా అక్రమంగా పొందారన్నారు. రొౌతు అనంతరావు, రాములు, జగ్గునాయుడు, చిట్టిబాబు, జి.వెంకటరమణ, రొౌతు రామస్వామి, శ్రీహరి, కురమయ్య, కొండలరావు తదితరులు సుభలయ, గాజులకొల్లివలస, మెట్టూరు ఆర్‌అండ్‌ఆర్ కాలనీల్లో అక్రమంగా ఇళ్ల స్థలాలు పొందారన్నారు. ప్రభుత్వ స్థలాలు అక్రమంగా పొందడంపై దర్యాప్తు చేపట్టి అక్రమార్కులపై చట్టపరమైన చర్యలు తీసుకోవాలని కోరినట్లు తెలిపారు.

సాక్షి దినపత్రికలో ప్రకటనల కోసం మీ ప్రాంతంలో మా ప్రతినిధులు అందుబాటులో ఉన్నారు.
వివాహ, జన్మదిన, పదవీ విరమణ శుభాకాంక్షలు
వ్యాపార, ఉద్యోగ, బహిరంగ ప్రకటనలు
శ్రద్ధాంజలి, నిర్యాణము, వర్ధంతి మొదలగు
అన్ని రకాల ప్రకటనలు ఇవ్వదలిచిన వారు సంప్రదించండి.
ఆమదాలవలస/ పాతపట్నం: 9010177724
నరసన్నపేట: 9912220367
Office mail : sklmadvt@gmail.com